## పోలీస్ స్టేషన్‌కు ఎస్ఐ, వైద్యశాలకు వైద్యాధికారిని నియమించాలి

### సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు,మాజీ ఎంపీపీ ములకలపల్లి రాములు



మునగాల, జూన్ 30 ( వు దయం):మునగాల మండల పోలీస్ స్టేషన్‌లో ఖాళీగా ఉన్న ఎస్ఐ పోస్టును, మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి పోస్టును వెంటనే భర్తీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు, మునగాల మాజీ ఎంపీపీ ములకలపల్లి రాములు ఉన్నతాధికారులను కోరారు.

మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మునగాల మండలం జాతీయ రహదారిపై ఉండటంతో ప్రతిరోజూ రోడ్డు ప్రమాదాలు, భూ వివాదాలు తదితర సమస్యలు అధికంగా ఎదురవుతున్నాయని తెలిపారు. ప్రజలు పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించినప్పటికీ స్థానికంగా ఎస్ఐ పోస్టు ఖాళీగా ఉండటంతో బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ఖాళీగా ఉన్న మునగాల ఎస్ఐ పోస్టును తక్షణమే భర్తీ చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్ లేకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు ఇచ్చిన బాధితులు రోజుల తరబడి న్యాయం కోసం ఎదురుచూడాల్సి వస్తోందని పేర్కొన్నారు.

అదేవిధంగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహించిన డాక్టర్ పి. రవీందర్‌పై తోటి సిబ్బందిని వేధిస్తున్నారనే ఆరోపణలు నిరూపితమవడంతో, ఆయనను క్రమశిక్షణ చర్యల నిమిత్తం హైదరాబాద్‌లోని తెలంగాణ ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకుల కార్యాలయానికి సరెండర్ చేసినట్లు తెలిపారు. దీంతో ప్రస్తుతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి లేకపోవడం వల్ల మండల ప్రజలకు వైద్య సేవలు అందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. అందువల్ల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వెంటనే సీనియర్ వైద్యాధికారిని నియమించాలని జిల్లా అధికారులను కోరారు. స్థానిక ఎమ్మెల్యే, జిల్లా ఎస్పీ, జిల్లా డీఎంహెచ్‌వో ప్రత్యేక చొరవ తీసుకుని మునగాల పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ పోస్టును, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి పోస్టును వెంటనే భర్తీ చేయాలని ములకలపల్లి రాములు విజ్ఞప్తి చేశారు.

# భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స విజయవంతం

**సేవే పరమావధిగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు**

**నిరుపేద యువకుడికి పునర్జన్మనిచ్చిన భద్రాచలం ప్రభుత్వ వైద్య బృందం**

**ప్రైవేట్ ఆసుపత్రుల్లో రూ.30 లక్షలు ఖర్చు చేసినా దక్కని ఫలితం... ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా విజయవంతమైన క్లిష్ట శస్త్రచికిత్స**

**నాలుగు నుంచి ఐదు గంటలపాటు స్వయంగా శస్త్రచికిత్సలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు**

భద్రాచలం జూన్ ,30 (వుదయం ప్రతినిధి):సేవాభావం, వైద్య నైపుణ్యం, ప్రజల పట్ల అంకితభావం కలిస్తే ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ అద్భుతాలు సాధ్యమవుతాయని భద్రాచలం ఏరియా ఆసుపత్రి మరోసారి చాటిచెప్పింది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ నిరుపేద యువకుడికి విజయవంతంగా అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్స నిర్వహించి కొత్త జీవితాన్ని ప్రసాదించడం వైద్య రంగంలో విశేషంగా నిలిచింది.వెంకటాపురం మండలం సుదిబాక గ్రామానికి చెందిన 28 ఏళ్ల మడప భాస్కర్ విద్యుత్ షాక్‌కు గురై శరీరంలో సుమారు 60 శాతం వరకు తీవ్రమైన కాలిన గాయాలతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. విద్యుత్ ప్రమాదం వల్ల చర్మం, కండరాలు, శరీర అవయవాలు తీవ్రంగా దెబ్బతినడంతో అతని ప్రాణాలను కాపాడడం వైద్యులకు పెద్ద సవాలుగా మారింది.ప్రమాదం జరిగిన వెంటనే కుటుంబ సభ్యులు ప్రాణాలు కాపాడాలనే ఆందోళనతో హైదరాబాద్‌లోని పలు ప్రముఖ ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించారు. అక్కడ నెలల తరబడి చికిత్స కొనసాగించినప్పటికీ పూర్తి స్థాయిలో ఆరోగ్యం మెరుగుపడలేదు. చికిత్స కోసం రూ.20 నుండి రూ.30 లక్షల వరకు భారీగా ఖర్చు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అప్పులు చేయడం, బంధువుల వద్ద సహాయం తీసుకోవడం, చివరకు తమ పొలాలను విక్రయించడం వరకు పరిస్థితి వెళ్లిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.అయినా వైద్య ఖర్చులు భరించే పరిస్థితి లేక చివరికి నిరాశలో ఉన్న కుటుంబ సభ్యులు భద్రాచలం ఎమ్మెల్యే, ప్రముఖ జనరల్ సర్జన్ డాక్టర్ తెల్లం వెంకటరావును ఆశ్రయించారు. వారి బాధను విన్న వెంటనే ఆయన మానవతా దృక్పథంతో స్పందించి ఆలస్యం చేయకుండా రోగిని భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించాలని అధికారులను ఆదేశించారు.తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలోని భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో రోగిని అత్యవసరంగా చేర్పించి అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. రోగి పరిస్థితిని



పూర్తిగా పరిశీలించిన అనంతరం అత్యవసర శస్త్రచికిత్స తప్ప మరో మార్గం లేదని వైద్యులు నిర్ణయించారు.ఆసుపత్రిలో ఆ సమయంలో జనరల్ సర్జన్ అందుబాటులో లేకపోవడంతో, స్వయంగా జనరల్ సర్జన్ అయిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు శస్త్రచికిత్స బాధ్యతను చేపట్టారు. ప్రజాప్రతినిధిగా ఉన్నప్పటికీ వైద్యుడిగా తన వృత్తి ధర్మాన్ని మరవకుండా నాలుగు నుంచి ఐదు గంటలపాటు ఆపరేషన్ థియేటర్‌లో ఉండి అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు.కాలిన గాయాల కారణంగా దెబ్బతిన్న మృత కణజాలాన్ని అత్యంత జాగ్రత్తగా తొలగించడం, ఇన్‌ఫెక్షన్ వ్యాపించకుండా ప్రత్యేక చికిత్స అందించడం, భవిష్యత్తులో అవయవాల పనితీరు సాధారణంగా ఉండేలా అవసరమైన శస్త్రచికిత్సా విధానాలను అనుసరించడం వంటి క్లిష్ట ప్రక్రియలను వైద్య బృందం సమర్థవంతంగా నిర్వహించింది.ఈ ఆపరేషన్‌లో ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ బి. దేవరాజ్, డాక్టర్ తాటి మల్లేష్, డాక్టర్ నికిత, డాక్టర్ కౌండిన్య, అనస్థీషియా నిపుణులు, నర్సింగ్ అధికారులు, ఆపరేషన్ థియేటర్ సిబ్బంది, పారామెడికల్ సిబ్బంది, టెక్నీషియన్లు సమన్వయంతో పనిచేశారు. ప్రతి క్షణం రోగి ప్రాణాలను కాపాడాలనే లక్ష్యంతో బృందం అత్యంత అప్రమత్తంగా వ్యవహరించింది.శస్త్రచికిత్స అనంతరం రోగిని ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచి ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి క్రమంగా మెరుగుపడుతోందని వైద్యులు తెలిపారు. రక్తపోటు, శ్వాసక్రియ, ఇతర శారీరక పరిస్థితులు స్థిరంగా ఉన్నాయని వెల్లడించారు.ఈ సందర్భంగా ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వై. రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించగల సామర్థ్యం ఉందని ఈ ఘటన మరోసారి నిరూపించిందన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు ప్రజాప్రతినిధిగా మాత్రమే కాకుండా సేవాభావం కలిగిన వైద్యుడిగా వ్యవహరించడం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని కొనియాడారు.ఆపరేషన్ విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి వైద్యుడికి, నర్సింగ్ సిబ్బందికి, అనస్థీషియా బృందానికి, ఆపరేషన్ థియేటర్ సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.రోగి తల్లిదండ్రులు భావోద్వేగంతో మాట్లాడుతూ, "మా కుమారుడి ప్రాణాలు దక్కవని అనుకున్నాం. మా ఆస్తులన్నీ అమ్ముకున్నా ఆశ కనిపించలేదు. అలాంటి సమయంలో ప్రభుత్వ ఆసుపత్రిలో మా బిడ్డకు ఉచితంగా చికిత్స చేసి ప్రాణాలు కాపాడిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు గారికి, వైద్య బృందానికి జీవితాంతం రుణపడి ఉంటాం. మా కుటుంబానికి ఇది పునర్జన్మలాంటి సంఘటన" అని కన్నీటి పర్యంతమయ్యారు.ఈ ఘటన తెలిసిన అనంతరం సుదిబాక గ్రామ ప్రజలు, వెంకటాపురం మండల ప్రజలు, భద్రాచలం పట్టణ ప్రజలు ఆసుపత్రికి చేరుకుని వైద్య బృందాన్ని అభినందించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇలాంటి వైద్య సేవలు అందుబాటులో ఉండటం పేదలకు గొప్ప వరమని పేర్కొన్నారు.

ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఎవ్వరూ వైద్యం లేక ప్రాణాలు కోల్పోకూడదన్న సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని వైద్యులు పేర్కొన్నారు. భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో ఆధునిక వైద్య సదుపాయాలను మరింత విస్తరించి ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.ఈ అరుదైన శస్త్రచికిత్స విజయవంతం కావడం భద్రాచలం ఏరియా ఆసుపత్రి వైద్య చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయంగా నిలిచింది. ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయడమే కాకుండా, సేవాభావంతో పనిచేసే వైద్యుల అంకితభావానికి ఇది నిదర్శనంగా నిలిచిందని ప్రజలు ప్రశంసిస్తున్నారు.

# నెల్లిపాక గ్రామంలో క్షుద్ర పూజల కలకలం

- భయాందోళనలో నెల్లిపాక బంజర గ్రామస్థులు....
- మనుషులపై క్షుద్ర పూజలు చేశారా... గుప్త నిధుల కోసం చేశారా...? అనే భయాందోళనలో స్థానికులు.....
- అధికారులు ఇటువంటి సంఘటనలపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్.....









అశ్వాపురం, జూన్ ,30 (వుదయం ప్రతినిధి):పూర్వ కాలంలో రాజులు యుద్ధాల సమయంలోనూ, విదేశీ దండయాత్రల భయం వల్లనూ తమ సంపదను, బంగారు నాణేలను భూమిలో, రహస్య ప్రదేశాలలో భద్రపరిచారు. అనివాటినిగుప్త సామ్రాజ్యం నాణేలు: భారత చరిత్రలో స్వర్ణయుగంగా పిలువబడే గుప్తుల కాలంలో (క్రీ.శ. 320--550) రాజులు అనేక బంగారు నాణేలు ముద్రించారు. కాలక్రమేణా యుద్ధాల వల్ల చాలావరకు నాణేలు కరిగిపోయినా, ఇప్పటికీ కొన్ని ప్రాంతాలలో భూమిలో పాతిపెట్టిన గుప్త నిధులుగా దొరుకుతున్నాయి.దేవాలయాలు & కోటలు: భారతదేశంలో కాకతీయులు, విజయనగర రాజులు, చోళులు వంటి పురాతన రాజవంశాలు పాలించిన ప్రదేశాలలో ఇప్పటికీ రహస్య సొరంగాలు, గుప్త నిధులు ఉన్నాయని స్థానిక కథనాలు చెబుతుంటాయి. ప్రత్యేకించి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని పురాతన కోటలు, శిథిలమైన దేవాలయాల పరిసరాలలో నిధులు దాచారనే నమ్మకాలు బలంగా ఉన్నాయి. అయితేభారతదేశంలో ఎవరైనా చట్టవిరుద్ధంగా భూమిని తవ్వి నిధులు లేదా బంగారం సేకరించడం నేరం. పురాతత్వ వస్తువుల చట్టం స్థానిక ప్రభుత్వ అధికారులకు సమాచారం అందించాలి గుప్త నిధుల గురించిన అధికారిక సమాచారం కూడా ఇవ్వొచ్చని అధికారులు జారీ చేసినప్పటికీ చెలరేగిపోతున్న గుప్త నిధుల ముఠా కి అధికారులు ఎప్పుడు గుణపాఠం చెబుతారా అని ఎదురుచూస్తున్న గ్రామస్తులు... భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గం అశ్వాపురం మండలం నెల్లిపాక గ్రామం గోదావరి ఒడ్డు దగ్గర నిన్న రాత్రి క్షుద్ర పూజలు నిర్వహించిన దృశ్యాలు కనిపించడంతో ఆ ప్రాంత వాసులు అందరూ కూడా ఒకసారిగా ఉలిక్కిపడ్డారు . గోదావరి ఒడ్డున ఇసుకలో ఒక గుండం గీసి చుట్టు మేకులు కొట్టి నిమ్మకాయలు, పసుపు, కుంకుమ, నాలుగు కోళ్లు కోసి, ఒక మేక ను కోసి ఆ గుండం లో వదిలేసి వెళ్లారని గ్రామస్థులు తెలిపిన సమాచారం ప్రకారం తెలుస్తుంది. ఇలాంటి పూజలు చూడడం ఇదే మొదటి సారి అని గ్రామస్థులు తెలుపుతున్నారు. **ఈ పూజలు దేనికోసం...?** ప్రస్తుతం అశ్వాపురం మండలం నెల్లిపాక గ్రామంలో గోదావరి పరివాహక ప్రాంతంలో జరిగినటువంటి క్షుద్ర పూజలు ఆ ప్రాంతంలో కలకలం రేపాయి. అక్కడ ఆ ప్రాంతంలో ఆ దృశ్యాలు చూసి పలువురు భయాందోళనకు గురి అయ్యారు. ఆ నోట ఈ నోట ఆ సమాచారం తెలిసి ఆ ప్రాంతం పరిశీలించి పలువురు భయంతో ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కంప్యూటర్ యుగంలో ఉన్న ఇలాంటి మూఢనమ్మకాలు ఇంకా ఈ ప్రాంతాల్లో జరుగుతున్నాయి అంటే ఆశ్చర్య పోవాల్సింది పరిస్థితి.

ఇక్కడ జరిగిన పూజలు చూస్తే ఆ రీతిలో భయం కలుగజేస్తున్నాయి కోళ్లు మేకలను బలిస్తూ నిమ్మకాయలు , గుమ్మడికాయ పసుపు కుంకుమ చల్లి అక్కడ అర్ధరాత్రి పూజ జరిగినట్లుగా ఆ ప్రదేశాలను బట్టి అంచనాకి వస్తున్నారు. ఈ ప్రాంతంలో అర్ధరాత్రి క్షుద్ర పూజలు ఎవరు చేశారు ఎవరికోసం చేశారు ఎందుకోసం చేశారు అనే ప్రశ్నలు అందరిలోనూ మెదులుతూ ఉన్నాయి. పలువురు ఇటువంటి పూజలు మనుషులు పైన చేస్తూ ఉంటారని వారి పగాప్రతీకరాలు ఈ విధంగా తీర్చుకుంటారని, మరికొందరు లంకె బిందెల కోసం, గుప్తనిధుల కోసం ఇలాంటి బలులు ఇస్తూ మూఢనమ్మకాల్లో కొంతమంది కొనసాగుతూ ఉండటం జరుగుతుందని పలువురు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. నిజంగా అటువంటి క్షుద్ర పూజలు ఈ ప్రాంతంలో ఎవరు చేశారు ఎందుకు చేశారు అనే ప్రశ్నలు మాత్రం ఉన్నాయి కానీ సమాధానం లేదు. మూఢనమ్మకాలను వదిలేయండి... 2026 సంవత్సరంలో కూడా ఇటువంటి మూఢనమ్మకాల్లో జనం ఉన్నారంటే ఆశ్చర్య పోవడం తప్ప మరొకటి లేదని చెప్పవచ్చు టెక్నాలజీ పెరుగుతూ ఉంది రోజు రోజుకి కొత్త కొత్త విజ్ఞానం వస్తూ ఉంది అయినా గాని ఇలాంటి క్షుద్ర పూజలు ఇంకా జరగటం అందరిని విస్మయానికి గురి చేస్తుంది. పోలీసులు మేధావులు ఇటువంటి మూఢనమ్మకాలు విడనాడాలని అవగాహన కార్యక్రమాలు చేస్తున్న గాని ఇలాంటి క్షుద్ర పూజలు అప్పుడప్పుడు వలుచోట్ల దర్శనమిస్తూ ఉన్నాయి. అయితే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం నెల్లిపాక గ్రామంలో జరిగిన ఈ క్షుద్ర పూజలు ఎవరు చేశారు ఏంటి అనేది పోలీసులు తేల్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకొని మరోసారి ఇలాంటి సంఘటన పునరావతం కాకుండా అధికారులు చూడాలని పలువురు కోరుతున్నారు.

# మండల కాంగ్రెస్ అధ్యక్ష పదవిపై బీసీల గురి

**బీసీ వర్గాల నుంచి పెరుగుతున్న డిమాండ్**




మునగాల జూన్ 30 ( వుదయం)మునగాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవిపై బీసీ వర్గాల కన్ను పడింది. మండలంలో పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంలో బీసీ నాయకులు, కార్యకర్తలు కీలక పాత్ర పోషించినప్పటికీ, ఇప్పటి వరకు వారికి తగిన రాజకీయ ప్రాధాన్యత దక్కలేదనే భావన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో త్వరలో భర్తీ కానున్న మండల కాంగ్రెస్ అధ్యక్ష పదవిని బీసీ వర్గాలకు కేటాయించాలని పలువురు బీసీ నాయకులు పార్టీ ముఖ్య నేతల వద్ద బలంగా వాదిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.


మండలంలో బీసీల జనాభా గణనీయంగా ఉండటంతో పాటు ఎన్నికల సమయంలో పార్టీ విజయానికి వెన్నెముకలా నిలుస్తున్నది కూడా బీసీ వర్గాలేనని నాయకులు పేర్కొంటున్నారు. పార్టీ కోసం సంవత్సరాలుగా కష్టపడుతున్న కార్యకర్తలకు గుర్తింపు ఇవ్వాల్సిన సమయం వచ్చిందని, సామాజిక న్యాయం గురించి మాట్లాడే కాంగ్రెస్ పార్టీ ముందుగా తన సంస్థాగత నియామకాలలోనే ఆచరించి చూపించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. "పార్టీ జెండా మోసేది బీసీలే.. కష్టకాలంలో పార్టీని నిలబెట్టేది బీసీలే.. కానీ పదవుల విషయంలో మాత్రం పక్కన పెడుతున్నారు" అనే అసంతృప్తి పలువురు కార్యకర్తల నుంచి వ్యక్తమవుతున్నట్లు తెలుస్తోంది. ఈసారి కూడా బీసీలకు అవకాశం కల్పించకపోతే పార్టీ కేడర్‌లో అసంతృప్తి పెరిగే అవకాశాలు ఉన్నాయని కొందరు హెచ్చరిస్తున్నారు.

అధ్యక్ష పదవిపై ఇప్పటికే పలువురు ఆశావహులు లాబీయింగ్ ప్రారంభించిన నేపథ్యంలో, అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది. అయితే బీసీ వర్గాలకు చెందిన నాయకులు మాత్రం ఈసారి అధ్యక్ష పదవి తమకే కేటాయించాలని గట్టిగా పట్టుబడుతున్నట్లు సమాచారం. సామాజిక సమీకరణాలు, పార్టీ బలోపేతం, కేడర్ ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకోవాలని వారు కోరుతున్నారు.మొత్తంగా మునగాల కాంగ్రెస్ రాజకీయాల్లో మండల అధ్యక్ష పదవి అంశం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారగా, బీసీల డిమాండ్‌కు పార్టీ నాయకత్వం ఎలా స్పందిస్తుందన్నది చర్చనీయాంశంగా మారింది.

# ఉద్దీపకం వర్క్‌బుక్ బోధనపై ఐటీడీఏ పీవో ఆరా

**చెన్నాపురం, ఉయ్యాలమడుగు జీపీఎస్ పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు**





చర్ల, జూన్ 30 :(వుదయం ప్రతినిధి) గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న జీపీఎస్ పాఠశాలల్లో విద్యార్థులకు పునాది స్థాయిలో నాణ్యమైన విద్య అందించేందుకు ఉద్దీపకం వర్క్‌బుక్లోని అంశాలను ప్రతి విద్యార్థికి సులభంగా అర్థమయ్యేలా బోధించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఉపాధ్యాయులకు సూచించారు.

మంగళవారం చర్ల మండలంలోని మారుమూల అటవీ ప్రాంతం, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర సరిహద్దు గ్రామాలయిన చెన్నాపురం, ఉయ్యాలమడుగు జీపీఎస్ పాఠశాలలను పిఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు . ఈ సందర్భంగా విద్యార్థులతో మమేకమైన పీవో కొంతసేపు ఉపాధ్యాయుడిగా బోధించడంతో పాటు, అనంతరం విద్యార్థుల నుంచి ఉద్దీపకం వర్క్‌బుక్‌లోని అంశాలను ప్రశ్నించి వారి అభ్యాస స్థాయిని పరిశీలించారు.పరిశీలనలో పలువురు విద్యార్థులు ఉద్దీపకం వర్క్‌బుక్ అంశాలు, చతుర్వేద అభ్యాస ప్రక్రియల్లో వెనుకబడి ఉన్నట్లు గమనించిన పీవో ఉపాధ్యాయుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి విద్యార్థి వర్క్‌బుక్‌లోని అంశాలను పూర్తిగా అర్థం చేసుకునేలా ప్రతిరోజూ క్రమబద్ధంగా బోధించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.విద్యార్థుల హాజరు శాతం తగ్గకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అవసరమైతే ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను చైతన్యపరచి పిల్లలను తప్పనిసరిగా పాఠశాలకు పంపించేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. అలాగే ఉపాధ్యాయులు ప్రతిరోజూ సమయానికి పాఠశాలకు తప్పని సరిగా హాజరుకావాలని, సమస్యలు ఉంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు .చెన్నాపురం జీపీఎస్ పాఠశాలలో 55 మంది విద్యార్థులు చదువుతున్నందున అదనపు ఉపాధ్యాయుడిని నియమించాలని ఉపాధ్యాయులు కోరగా, త్వరలోనే మరో ఉపాధ్యాయుడిని నియమిస్తామని పీవో హామీ ఇచ్చారు.అనంతరం ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు జిల్లా గిరిజన సంక్షేమ అధికారి చందన తిమ్మిరిగూడెం జీపీఎస్ పాఠశాలను సందర్శించి విద్యా కార్యక్రమాలను పరిశీలించారు.ఈ తనిఖీల్లో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి చందనతో పాటు ఉపాధ్యాయులు రమేష్, శ్రీనివాస్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మండవ రాములు గౌడ్‌కు ఘన నివాళి




మునగాల జూన్ 30 (వుదయం):మునగాల మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మండవ రాములు గౌడ్ మృతి చెందడంతో, ఆయన పార్థివ దేహానికి కోదాడ మార్కెట్ కమిటీ డైరెక్టర్, మునగాల గ్రామ మాజీ సర్పంచ్ కాసర్ల కోటేశ్వరరావు నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఈ సందర్భంగా కాసర్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ, మండవ రాములు గౌడ్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి విశేష కృషి చేసిన నాయకుడని, ఆయన మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు.

నివాళులర్పించిన వారిలో మునగాల గ్రామ ఉపసర్పంచ్ కాసర్ల వెంకట్, గ్రామ శాఖ అధ్యక్షుడు కొమ్ము వీధరావు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ మండల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కుక్కడపు లక్ష్మయ్య, కొండా రామాంజి, గుండు నాగేశ్వరరావు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్లు



కోదాడ జూన్ 30(వుదయం) తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) ఆధ్వర్యంలో 2026 విద్యా సంవత్సరానికి ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలు ప్రారంభమైనట్లు లక్ష్య డిస్టెన్స్ అకాడమీ కోఆర్డినేటర్ అనంతుల సతీష్ తెలిపారు. 14 ఏళ్లు నిండిన వారు ఎలాంటి విద్యార్హత లేకున్నా 10వ తరగతిలో చేరవచ్చని, 10వ తరగతి ఉత్తీర్ణులు ఒకే ఏడాదిలో ఇంటర్ పూర్తి చేసుకునే అవకాశం ఉందన్నారు. ప్రవేశాలకు జూలై 27 చివరి తేదీగా పేర్కొన్నారు. వివరాలకు: 9542107771, 7981528312. సంప్రదించాలన్నారు.

